క్లుప్తంగా

రాజీనామా

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన సంపత్ బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వెంటనే ఉంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడ్డానని అన్నారు. పేరుకే మండల ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారే తప్ప ఏలాంటి కార్యక్రమాలకు పిలువడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఏలాంటి పదవి లేకున్నా ప్రజల కోసం పని చేస్తానని వెల్లడించారు.

జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యలు అనైతికం

భూపాలపల్లి అర్బన్: పాత పెన్షన్ విధానంపై జయప్రకాశ్‌నారాయణ వ్యాఖ్యలు అనైతికమని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ దిల్షాద్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. స్వచ్ఛంద పదవి విరమణ తీసుకున్న ఐఏఎస్ అధికారి, మాజీ ప్రజాప్రతినిధిగా రెండు ప్రభుత్వ పెన్షన్లు తీసుకుంటూ పాత పెన్షన్ విద్రోహంగా ఉందని జయప్రకాష్‌నారయణ వ్యాఖ్యలు బాధకలించిదన్నారు. పెన్షన్ భిక్ష కాదని ఉద్యోగి హక్కు అని గుర్తు చేశారు. సంక్షేమ రాజ్యంలో ప్రజలందరికీ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పెన్షన్ అమలు చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలుగుతుందని విషపూరితంగా మాట్లాడటం సరికాదన్నారు.

మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యశ్వంత్

టేకుమట్ల: యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన వైనాల యశ్వంత్‌ను శుక్రవారం నియమించినట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మండల అధ్యక్షుడు సతీష్‌గౌడ్, శ్రీకాంత్‌లకు యశ్వంత్ కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్'

మహాముత్తారం: 40సంవత్సరాలుగా మంథని ప్రాంతాన్ని పాలించిన కాంగ్రెస్ నాయకులు ప్రజలను ఎన్నడు పట్టించుకోలేదని ఓయూజేఏసీ స్టుడెంట్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం మహాముత్తారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల నాయకులపై వందల కేసులు పెట్టించి జైలుకు పంపించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారుగుర్తుకు ఓటు వేసి పుట్ట మధును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూజేఏసీ విద్యార్థి నాయకులు కుమారస్వామి, రామంచ దేవేందర్, అక్కపాక రమేష్, శ్రీనివాస్, మధూకర్ ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వాజేడు: మద్యం తాగవద్దని భార్య మందలించడంతో ఒకరూ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన మొడెం కృష్ణయ్య (54) మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతడి భార్య సమ్మక్క మద్యం తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని మానేయాలని మందలించింది. మనస్థాపానికి గురైన కృష్ణయ్య ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం చేయిస్తుండగానే మృతి చెందాడు. భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పేద కుటుంబం కావడంతో దహన సంస్కారాల నిమిత్తం గుమ్మడిదొడ్డి సర్పంచ్ పాయం జయలక్ష్మి మరి కొందరితో కలిసి రూ.2000 ఆర్థిక సాయం అందజేశారు.

గిరిజనేతరులకు పోడు హక్కు పత్రాలు


కొత్తగూడ: మాట్లాడుతున్న మంత్రి సత్యవతి


పొలం గట్టుపై అల్పాహారం తింటున్న నాగజ్యోతి


ములుగు: పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- మంత్రి సత్యవతి రాథోడ్

కొత్తగూడ: గిరిజనేతరులకు పోడు హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు రైతుబంధు, రైతు బీమా వర్తింపజేస్తామని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. ములుగు ఎమ్మెల్యేగా బడే నాగజ్యోతిని గెలిపిస్తే కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధిని తన బాధ్యతగా తీసుకుంటానని అన్నారు. రెండు మండలాల భూములకు రెండు పంటలు పండే విధంగా పాకాల రిజర్వాయర్ నుండి లిఫ్ట్ ద్వారా సాగు నీరు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతి, రాష్ట్ర రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌నాయక్, ధరంసింగ్ నాయక్, వేణు, నెహ్రూ పాల్గొన్నారు.

పొలం గట్లపై అల్పాహారం

మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి సమయభావం దృష్ట్యా పొలం గట్లపై అల్పాహారం చేశారు. శుక్రవారం మండలంలో గ్రామాల్లో ప్రచారం నిమిత్తం వచ్చిన నాగజ్యోతి గుడంపల్లి పొలం గట్లపై సాదా సీదాగా అల్పాహారం స్వీకరించారు.

ఏటూరునాగారం: కేసీఆర్ పథకాలు అందరికి భరోసా అని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 5వ, 15వ వార్డుల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆదేశాల మేరకు బడే నాగజ్యోతి కారుగుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు.

ములుగు: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలవాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని నాగులమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సురేష్, రాహుల్, రాజు, రవీందర్, వెంకటేష్, రమేష్, సాయి, రాజు, శ్రీనివాస్, యశ్వంత్, అరుణ్, మహేందర్ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలిపించాలని కోరుతూ మండలంలోని కొండపర్తి గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు సాంబయ్య, నాయకులు ఈసం సాంబయ్య, నాగేశ్వర్‌రావు, రామయ్య, సల్లూరి లక్ష్మణ్, మంత్తెన శ్రీనివాస్, మనోజ్‌రెడ్డి, పురుషోత్తం సాంబయ్య, సంతోష్ పాల్గొన్నారు.

ఇంటినుంచే ఓటు వేసేందుకు..

- దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి 169 దరఖాస్తులు
- ఫారం 12డీ ద్వారా పేర్లు నమోదు

ములుగు: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నూతన విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు, సీనియర్ సిటీజన్లు తమ తమ ఓటుహక్కును ఇబ్బందులు లేకుండా ఇంటి వద్ద నుంచే వినియోగించుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు ఇప్పటికే సంబంధిత అధికారులతో పాటు స్థానిక బీఎల్ఓలు, దివ్యాంగులు, సీనియర్ సిటీజన్లకు అవగాహన కల్పించారు. వారి ప్రతీ ఇంటికి రెండు సార్లు వెళ్లి సమాచారం అందించారు.

ఫారం 12డీ ద్వారా దరఖాస్తు

ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఫారం 12డీ ద్వారా తమ దివ్యాంగ సర్టిఫికెట్, వయస్సుకు సంబంధించిన ఆధార్, విద్యార్హత, ఇతరత్రా కాపీలను అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు ములుగు నియోజకవర్గంలో 3,077మంది దివ్యాంగులు, 2,976 మంది సీనియర్ సిటిజన్లు ఉండగా కేవలం 169 మంది నుంచి మాత్రమే దరఖాస్తులు అందాయి. మిగతా వారంతా నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేస్తామని చెబుతున్నారని బీఎల్ఓలు వివరించారు.

అధికారుల సమక్షంలో ఓటు

దివ్యాంగులు, సీనియర్ సిటీజన్లు ఏ పోలింగ్ స్టేషన్ నుంచి దరఖాస్తు చేసుకున్నారనే విషయాన్ని తెలుసుకొని ఎన్నికల కమిషన్ తరపున డీఆర్‌డీఓ, ఐకేపీ, బీఎల్ఓ, పోలీస్, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో సంబంధిత ఓటరు ఓటుహక్కు పత్రంపై ఏదేని అభ్యర్థి గుర్తుపై స్వస్తిక్ స్టాంప్‌ను వేసి సీల్డ్ కవర్ ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఓటు ప్రక్రియ పూర్తి అయిన తరువాత బాక్సులను సమీపంలోని పోలింగ్ కేంద్రానికి తరలిస్తారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు.

సౌకర్యాలు కల్పించాం..



నియోజకవర్గంలో ఇంటి నుంచే ఓటు వేయాలకునే దివ్యాంగులు, వయో వృద్ధులు 169మంది దరఖాస్తులు చేసుకున్నారు. నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలకునే వారికోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, వీల్ చైర్లు, సహాయకులను నియమించాం. గ్రామాల ప్రజలను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. ఈవీఎం బాక్సులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భద్రంగా ఉంచుతాం. ఈవీఎంలు తరలించే క్రమంలో వీడియోలు తీయిస్తాం. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడా 1500మంది కంటే ఎక్కువ ఓటర్లు లేకుండా పోలింగ్ కేంద్రాలను కేటాయించాం.

\- కలెక్టర్ ఇలా త్రిపాఠి

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

గోవిందరావుపేట: అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దని పస్రా ఎస్సై షేక్ మస్తాన్ అన్నారు. పస్రా పరిధిలోని మచ్చాపూర్ గొత్తికోయ గుంపుని శుక్రవారం ఆయన సందర్శించారు. రానున్న ఎలక్షన్ దృష్ట్యా గొత్తికోయలతో వివిధ రకాల విషయాలను ఎస్సై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.


గోవిందరావుపేట: మాట్లాడుతున్న ఎస్సై షేక్‌మస్తాన్

వాహనాల తనిఖీ

వాజేడు: మండల పరిధిలో మండపాక గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసుల వాహన తనిఖీలను నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని ఇప్పగూడెంలో శుక్రవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పోలీసులు మాట్లాడుతూ.. గ్రామంలో గొడవలు పడవద్దని, గుడుంబా విక్రయించరాదని సూచించారు. సీ విజిల్‌పై అవగాహన కల్పించారు.

సమ్మేళనానికి తరలిరావాలి

రేగొండ: జిల్లా కేంద్రంలో ఈ నెల 21న నిర్వహించే మైనార్టీ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని మైనార్టీలు తరలిరావాలని జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ రహీంపాషా అన్నారు. ఆత్మీయ సమ్మేళనం పత్రికను మైనార్టీలకు శుక్రవారం అందజేశారు. ఈ సమావేశానికి హోం మంత్రి మహమూద్ అలీ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కరీం, జిల్లా కో ఆప్షన్ సభ్యులు యాకుబ్, మైనార్టీ సేవా సమితి నాయకులు సాదిక్ ఆరిఫ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ అన్వర్ పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 2వ వార్డుకు చెందిన మాటూరి గౌరమ్మ ప్రమాదవశాత్తు మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు శుక్రవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శివాలయ చైర్మన్ తాడూరి రఘు, ప్రదీప్‌రావు, వలిబాబు, గండెపల్లి నర్సయ్య, బాస పుల్లయ్య, ఖలీల్, ఎజాస్, శేఖర్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అభినవ్

కన్నాయిగూడెం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని వైద్యుడు అభినవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ గిరిజన పాఠశాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అభినవ్ మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మన్,సిబ్బంది పాల్గొన్నారు


వెంకటాపురం(కె): పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


ఏటూరునాగారం: ఆకులవారిఘణపురంలో..

ఘనంగా నాగుల చవితి

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో, గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల వద్ద ఉన్న పుట్టల్లో మహిళలు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఉన్న దేవతలను దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయాల వద్ద భక్తుల సందండి నెలకొంది. పుట్టల వద్ద సంతానం లేని దంపతులు వరం పట్టారు. పుట్టమట్టిని ఇంటికి తెచ్చుకొని నుదుట బొట్టుగా అలంకరించారు.

\- ఏటూరునాగారం/గోవిందరావుపేట/వెంకటాపురం(కె)/వాజేడు


గోవిందరావుపేటలోని గోవిందరాజుల స్వామి ఆలయంలో భక్తులు


గోవిందరావుపేట: చల్వాయిలో..


ఏటూరునాగారం: పుట్టలో పాలు పోస్తూ..


ఏటూరునాగారం: ఓడవాడలో..


ఏటూరునాగారం: పోచమ్మగుడివద్ద..


వాజేడు: పాలు పోస్తున్న ఎంపీడీఓ విజయ

ఉత్తీర్ణత శాతం పెంపొందించాలి

కాటారం: ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ కార్యాలయం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీప్రసాద్ అన్నారు. మండలంలోని మేడిపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, డార్మెటరి భవనం, భోజనశాల, లైబ్రరీ, హెల్త్ రూం, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. పదవ తరగతి విద్యార్థులతో ఇంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సమ్మెటివ్ అసెస్మెంట్-1 ఫలితాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధించడం కోసం కష్టపడాలని తెలిపారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్, డైనింగ్‌హాల్ విస్తరణ, సబ్‌మెర్సిబల్ మోటర్ ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్ స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్

గుడుంబా స్థావరాలపై దాడులు


టేకుమట్ల: నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో పస్రా పోలీసులు గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎస్సై షేక్ మస్తాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో చల్వాయి గ్రామంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించమన్నారు. ఈ తనిఖీలో చల్వాయి గ్రామానికి చెందిన ఎల్లం సారమ్మ, కొండ శశికళ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే వాహనాలను తనిఖీ చేస్తుండగా బాలాజీ నగర్ గ్రామానికి చెందిన నగవత్ ప్రవీణ్ ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల గుడుంబాను సరఫరా చేస్తూ పట్టుబడటంతో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


గోవిందరావుపేటలో..

గుడుంబా స్వాధీనం

టేకుమట్ల: మండలంలోని వెలిశాలలో వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం గుడుంబాను స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన ఇస్లావత్ తిరుపతి అనే వ్యక్తి వద్ద వెలిశాలలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 5లీటర్ల గుడుంబాను గుర్తించినట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీన పర్చుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వాహన తనిఖీల్లో ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ మహేందర్ ఉన్నారు.

ఆశీర్వదించండి.. రుణపడి ఉంటా


భూపాలపల్లి రూరల్: ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి


మొగుళ్లపల్లి: ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: తనను ఆశీర్వదిస్తే రుణపడి ఉంటానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ నాయకులతో కలిసి కీర్తిరెడ్డి శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని 1000 క్వార్టర్స్, రెడ్డి కాలనీ, రెవెన్యూ కాలనీల్లో బీజేపీ భరోసా యాత్ర గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని సింగరేణి కార్మికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గెలిసిన వెంటనే సింగరేణి ఉద్యోగులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. ఆడ బిడ్డగా ఇంటి ముందుకు వచ్చానని ఆశీర్వదించంచాలని కోరారు. కీర్తిరెడ్డి గెలుపు కోరుతూ.. సుభాస్‌కాలనీలో బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆ పార్టీ నాయకులు గడప గడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టినా సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలన్నారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీలు మారే నాయకులను నమ్మొవద్దని కోరారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలన్నారు. చదువు రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్సిపేట, రంగాపూర్ గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు తరలివచ్చి కీర్తిరెడ్డికి మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలు మారే నాయకులు మాటలు నమ్మి మోసపోవద్దని ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వమని కోరారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రామచంద్రారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషం


టేకుమట్ల: మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి


శాయంపేట: ప్రచారం చేస్తున్న ప్రియాంకరెడ్డి, వైశాలిరెడ్డి, నాయకులు

- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరమణారెడ్డి

టేకుమట్ల: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపేడు, వెల్లంపల్లి, కుందనపల్లి, బండపల్లి, గుమ్మడవెల్లి, దుబ్యాల, మందలోరిపల్లి, ఆరెపల్లి, రాఘవరెడ్డిపేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలగాణలో పల్లెలన్ని అభివృద్ధి పథంలో పయణించేందుకు ప్రత్యేకంగా నిధులు, పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక, హరితహారం, అవెన్యూ ప్లాంటేషన్ వంటి పథకాలతో పల్లెలన్ని అందంగా మారాయని అన్నారు. అంతే కాకుండా రైతులకు పెట్టుబడి సాయం, 24గంటల విద్యుత్, రైతు భీమా, రుణమాఫీ ప్రకటించి వ్యవసాయాన్ని పండగలా చేస్తున్నారని అన్నారు. దళిత బంధు, బీసీ బంధు, కులవృత్తులకు పెద్దపీట వేశారని, విద్యార్థుల కోసం అల్పాహారం, హాస్టల్‌లతో ఉన్న విద్యను అందిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. కావున రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. ప్రతిపక్షాల మాయ మాటలకు మోసపోవద్దని, అభివృద్ధిని గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బస్వరాజు సారయ్య, ఎంపీ దయాకర్, ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవి, ఆకునూరి తిరుపతి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

శాయంపేట : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆయన కూతురు గండ్ర ప్రియాంకరెడ్డి, కోడలు గండ్ర వైశాలినిరెడ్డి శుక్రవారం మండలంలోని పెద్దకోడెపాకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గండ్ర వెంకటరమణారెడ్డికి ఓటువేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ లతాలక్ష్మణ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మోహిబూబ్‌బొద్దిన్, ఎంపీటీసీలు ప్రసాద్, మంగమ్మరవి, మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, అశోక్, కిరణ్, మల్లయ్య, తిరుపతి, విజయ్, నరేష్, రవీందర్, సదానందం, రమేష్, రామ్మూర్తి, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.